# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 31-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మెరుగైన ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టును తీసుకువస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఈరోజు ఉదయం నుంచి కొనసాగుతోంది.
- ❖ ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం జియో టాగ్‌ను అమలు చేస్తుందని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.
- ❖ విద్య, వైద్యంతో పాటు వృక్ష సంరక్షణ ఎంతో అవసరమని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు.

==========================

రాష్ట్రంలో మెరుగైన వైద్యాన్ని ప్రజల ఇంటి ముందుకు తీసుకువస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో రెండవ రోజు పర్యటనలో భాగంగా శాంతిపురం మండలం తులసినాయినిపల్లిలో జరిగిన బహిరంగసభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. ఎరువుల వినియోగం పెరిగితే అనారోగ్యం ఎక్కువ అవుతుందన్నారు. మెరుగైన ప్రజారోగ్యం కోసం సంజీవని ప్రాజెక్టును తీసుకువస్తున్నామని, ఇప్పటికే కుప్పంలో పైలెట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేశామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ భారం తగ్గించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంపై ప్రతిపక్ష పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం వడ్డిగూడెంలో కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి కేంద్రమంత్రి ఉపాధి కూలీలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ పథకం మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను అందిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు అన్నీ అవాస్తమని తెలిపారు. ఈ పథకంలో ఎటువంటి అవినీతి, అక్రమాలు లేకుండా జియో టాగ్‌ను అమలు చేస్తుందని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

===========================

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఈ రోజు ఉదయం నుంచి కొనసాగుతోంది. ప్రతి నెల ఒకటవ తేదీన ప్రారంభమయ్యే పింఛన్ల పంపిణీ ఒకరోజు ముందుగానే ప్రారంభమయ్యింది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని బెగ్గిలిపల్లెలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్దిదారులకు అందజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలురులో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెనాయుడు పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.

===========================

విశాఖపట్టణంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో శిశువు మృత్యువాత పడిన సంఘటనకు కారణమైన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. విశాఖ పర్యటనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రికి విమానాశ్రయంలో పట్నాల ఉమాదేవి అనే మహిళ తనకు జరిగిన అన్యాయంపై నిన్న ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పవన్ కళ్యాణ్ బాధిత మహిళను కుటుంబంతో సహా సోమవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

విరామం

===========================

విద్య, వైద్యంతో పాటు వృక్ష సంరక్షణ కూడా ఎంతో అవసరమని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరులోని ఒక కళాశాల ప్రాంగణంలోని ఏర్పాటు చేస్తున్న `మియావాకీ ఫారెస్ట్ ప్రాజెక్టు` ప్రారంభోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరవనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. అనంతరం కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ... విద్యా భ్యాసంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడంపైనా బాల్యదశ నుంచే ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలన్నారు. నేడు నాటిన ఈ మొక్కలు 30 ఏళ్లలో మహావనంగా మారి భావితరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

===========================

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో చైతన్యం పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని విశాఖపట్నం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఈరోజు విశాఖలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... విశాఖ కమీషనరేట్ పరిధిలో పోలీసు సిబ్బందికి చెందిన పిల్లలకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్యాన్సర్ ను నిరోధించే వ్యాక్సిన్ ను అందించామన్నారు. హెచ్‌పీవీ వైరస్ తో పాటు స్థూలకాయం, ధూమపానం వంటివి కూడా క్యాన్సర్ కి కారణంగా నిలుస్తున్నాయని చెప్పారు. విద్యా వంతుల్లో సైతం కాన్సర్ నిరోధించే వాక్సిన్‌పై అవగాహన పెంచాలన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండటం, సకాలంలో

స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవడం అవసరమని చెప్పారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ ను చికిత్సతో నివారించడం సాధ్యపడుతుందని కమిషనర్ వివరిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

===========================

క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు గుర్తింపు లభిస్తుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అన్నారు. అరకు ఉత్సవాల్లో భాగంగా 5 కిలోమీటర్ల మేర నిర్వహించిన అరకు మారథాన్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో క్రీడల పరంగా ప్రతిభకు కొదవలేదని, క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తెచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. నిరంతర సాధన చేస్తూ.. ఒలింపిక్స్ లాంటి అంతర్జాతీయ పోటీలలో రాణించే సామర్థ్యం కలిగిన క్రీడాకారులు మన ప్రాంతంలో ఉన్నారని, ఇటువంటి మారథాన్ లను ఉపయోగించుకొని మరింతగా రాణించాలని ఆయన కోరారు.

===========================

ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్త తయారుకావాలని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలో నైపుణ్యాలభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతన పారిశ్రామికవేత్తలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, మార్గదర్శకత్వం అందించడానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలో రాష్ట్రంలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి సృష్టిని ప్రోత్సహించడం జరుగుతోందన్నారు.

===========================

పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అన్నారు. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకుల సౌకర్యార్థం కుశ లోయలోని అద్భుతమైన జలపాతాలను సందర్శించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పర్యాటక బస్సును కలెక్టర్ ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా.. కుశ లోయ ప్రాంతానికి ఈ ప్రత్యేక బస్సు సర్వీసును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

===========================
===========================